# ప్రయాణం

**శాం**తకు స్మృతి తెలిసింది.

"నేనెవరు? ఎక్కడున్నాను?" అని ఆమె ఆశ్చర్యపడ్డది. ఆమెకు స్పృహ క్రమంగా రాసాగింది.

అవును. తను శాంత. వట్టి అభాగ్యురాలు! తన అభాగ్యం ఆమె నిప్పుడెంత మాత్రమూ బాధించటం లేదు. ఆ తల్లిదండ్రులు! ఆ దారిద్ర్యం! అదంతా ఇప్పుడు తనకు చాలా దూరమైనట్టుగా ఉంది.... ఆ భర్త. సుఖం పేరిట అతని వల్ల తను పడిన హింస! ఏటేటా కానుపులూ, పిల్లలు బతక్కపోవటమూ! ఇరవై రెండేళ్ళు నిండక పూర్వమే ఏడు కానుపులూ, వార్ధక్యమూ, వైధవ్యమూనూ! ఏడుగురు పిల్లలు – ఒక్కరైనా దక్కలేదు. వారంతా తనను ముసలిదాన్ని చెయ్యటానికి, తన కాంక్షా యవ్వనమూ హరించటానికి పుట్టి ఉంటారు! తన వయస్సు వాళ్ళకింకా యవ్వనాంకురాలైనా వదలలేదు. తన ఈడువాడే విశ్వం – ఇంకా స్త్రీ మోహమైనా ఎరగడు. వాడికి, పాపం చిన్న తనం నించీ తనంటే అంత ప్రేమ! తనవంక వాడు జాలిగా చూస్తుంటే పాతివ్రత్యం తుచ్ఛమైనది అనిపించేది, తను ఒక్క రవ్వ ప్రోత్సాహం ఇస్తే చాలు తన దగ్గిరికి ఉరకటానికి సిద్ధంగా ఉండేవాడు, కాని ఎట్లా? తనను నగ్నంగా చూసి వాడి గుండె పగలదా, పాపం! తను సాహసించలేకపోయింది – విశ్వానికి ఈషణ్మాత్రమైన ప్రోత్సాహం ఇవ్వలేకపోయింది!....

భర్తతో కాపరం చెయ్యటంలో ఎంత ఆనందం ఉన్నదనుకున్నది తను! తీరా అనుభవించ వచ్చేటప్పటికి తను ఊహించుకుంటున్న ఆనందంలో శతాంశం – సహస్రాంశం లేకపోయింది! తను భర్తకు ఎంత ఆనందం ఇవ్వాలనుకుందో, తను భర్తవల్ల ఎంత ఆనందం పొందాలని ఆశించిందో తన భర్త కలలోనైనా ఊహించాడా? ఆ దురదృష్టవంతుడు తన భార్య ఇవ్వదలుచుకున్న ఆనందం కోసం ఎన్నడన్నా ఆగాడా? బావిలో నీళ్ళు తోడుకున్నట్టు భార్యవల్ల తనకు తను తీసుకోగలిగిన ఆనందమేమిటో తీసుకుని భార్యను గురించిన ఆలోచనే లేకుండా ఆ ఎనిమిది సంవత్సరాలూ వెళ్ళబుచ్చి తన దారిన తను దాటిపోయినాడు. అతనికీ తనకూ ఏవిధమైన సంబంధమూ ఉన్నట్టుగా

లేదిప్పుడు! ఏం భర్త? అతని వల్ల తనకు ఒక్కసారి పరిపూర్ణమైన పారవశ్యం, నఖశిఖ పర్యంతమూ ఒక్క పులకరింత..!...

అంతకంటె విశ్వం ఒక్కసారి తన కళ్ళలోకి చూస్తే గుండెను ఎవరో గట్టిగా అదిమి పెట్టినట్టుగా అయి ఊపిరి సలిపేది కాదు, నఖశిఖ పర్యంతమూ జలదరించేది! ఏమిటీ విధి వైరం? విశ్వం వంక తను ఒక్కసారి ప్రేమగా చూడటానికి, అతనితో ప్రేమ పూర్వకంగా ఒక్కమాట మాట్లాడటానికి, అతన్ని ఒక్కసారి గాఢంగా ఆలింగనం చేసుకోవటానికి ఎందుకు నోచుకోలేదు? తను అంత మహాపాతకం ఏం చేసింది?....

అవును, అన్నట్టు తనకు జబ్బు చేసింది. ఎప్పుడో కలలో జరిగినట్టుంది. ఆ జబ్బేమయిందీ? అది నయం అయినట్టు తనకు జ్ఞాపకం లేదే! తనకు స్పృహ తెలియకుండా పోవటమూ, ఎవరో సన్నిపాతం అనటమూ, తన నుదుటిమీద ఉడుకులాం పట్టీలు వెయ్యటమూ, ఇంజక్షన్లు ఇవ్వటమూ, అప్పుడప్పుడూ తనకు ఒళ్ళు తెలిసి కళ్ళు తెరిచినప్పుడు ఎవరో ఒకరి మొహం దగ్గిరిగా కనిపించటమూ, ఎట్లా వుందనో, "నన్ను గుర్తుపట్టగలవా? నేనెవరు?" అనో అడగటమూ, ఇవి తప్ప ఇంకేమీ జ్ఞాపకం రావటంలేదు... తరవాత? తరవాత?...

తనింకా ఆ జబ్బులోనే ఉందా? ఉంటే తనకింత బాగా స్పృహ ఎట్లా తెలిసిందీ? తనకు నీరసంగా గాని జబ్బుగా వున్నట్టుగాని లేదేం?... తన రోగం నయమయిందేమో! తన మంచం చుట్టూ జనం లేరేమో! అబ్బ, ఆ జనంతో తల పట్టిపోయింది. వారంతా దేనికి? తన జీవితానికి చీమ తలకాయంత సుఖం చేకూర్చలేని వ్యర్థులు!...

శాంత కళ్ళు తెరిచి చూచి ఆశ్చర్యపడ్డది. అంతా అక్కడే ఉన్నారు. ఒకరూ తనకేసి చూస్తున్నట్టులేదు. అంతా ఏడుస్తున్నారు. మందమతులు. తనకు స్పృహవచ్చిన సంగతి వారికింకా తెలియలేదల్లే ఉంది. ఎంతమంది జనం! అందులో అనేక మొహాలు తనకు తెలిసినవిగా కూడా లేవు. వాటిని జ్ఞాపకం తెచ్చుకునే ఓపిక కూడా ఆమెకు లేదు.

"ఏడవనీ! నాకు స్పృహ వచ్చిన సంగతి వాళ్ళతో చెప్పకపోతేనేం?" అనుకుంది శాంత.

కాని ఎవరో తనకు స్మృతి తెలియటం గమనించారు. ఆయన తన దగ్గిరికి వస్తున్నాడు. ఎంత కళగల మనిషి!

"పోదాంపద, తల్లీ!" అంటున్నాడాయన.

"ఎక్కడికి?" అన్నది శాంత. కాని ఎక్కడికో ఆమెకర్థం అయింది చిత్రం! తనకు ఏమాత్రమూ భయం కలగటంలేదు.

"నీకింకా ఇక్కడ ఏం కోరిక ఉందమ్మా?" అంటున్నాడాయన.

తనునవ్వి, "నాకిక్కడ ఏం కోరిక తీరింది? నేను దారిద్ర్యంలోనూ దుఃఖం లోనూ జీవించాను. ఐశ్వర్యంకోసం జీవించి ఉండటానికి నాకింకా కోరిక ఉంది. నా విశ్వం కోసం బతికి ఉండాలని ఉంది. అతని విషయంలో నా ధర్మం నేను నిర్వర్తించలేదు. మీకేమీ అభ్యంతరం లేకపోతే నన్నింకా కొంతకాలం జీవించనివ్వండి. నిజమైన ఐశ్వర్యమూ, నిజమైన సుఖమూ అనుభవించనివ్వండి. ఈ కొద్దిపాటి అనుగ్రహించలేరా?" అన్నది.

ఆయన తన తలమీద చెయ్యిపెట్టి నిమురుతూ "పిచ్చితల్లీ!" అన్నాడు. ఆయన స్పర్శవల్లా ఆయన మాటలవల్లా బరువెక్కి ఉన్న తన మనస్సు ఒక్కసారిగా తేలిక అయి దేవత్వం సిద్ధించినట్టయింది.

"దారిద్ర్యంలో ఉండి కూడా ఐశ్వర్యసుఖాన్ని నువ్వు మానసికంగా పొందావు. ప్రపంచంలో వున్న ఐశ్వర్యమంతా నీకిచ్చినా నువ్వు అదివరకు పొందినదానికంటె ఒక్క రవ్వయినా అధిక సౌఖ్యం పొందలేవు. నీ విశ్వాన్ని ఎంత ప్రేమించాలో అంతా అదివరకే ప్రేమించావు. అతని వల్ల ఎంత సుఖం పొందాలో అంతా పొందావు. నీకు వెయ్యి సంవత్సరాల ఆయుర్దాయం ఇచ్చి అతన్ని నీకిచ్చినా నీవు పొందగలిగితే కొత్త సుఖం ఏమీ లేదు.

"నీ కింకేం మిగిలి ఉంది? నీ విశ్వం నీ భర్తకంటె ఏమంత భిన్నమైన మనిషికాదు. నీకు నేను మరికొంత ఆయుర్దాయమూ, ఐశ్వర్యమూ, విశ్వాన్నీ ఇచ్చినట్టయితే నీకు జీవితంలో ఎన్నడూ ఎరగనంత ఆశాభంగం కలుగుతుంది. తల్లీ! పోదాం పద!" అన్నాడాయన మెత్తని కంఠంతో.

ఆయన మాటలు తనకు ఎంత సత్యంగా వినిపించినయ్యంటే అవి ఆయన గొంతునుంచి కాక తన అంతరాత్మలోనించే వస్తున్నయ్యా అనిపించింది.

"వస్తున్నాను, పదండి!" అన్నది శాంత.

*మొదటి ముద్రణ : ఇల్లరికం కథల సంపుటి, మార్చ్ 1939*
*యువ కార్యాలయం, తెనాలి*